క్లుప్తంగా...

వేంకటేశ్వరస్వామి ఆలయానికి నిధులు

పోచారం: యమ్నంపేట్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేసేందుకు దేవాదాయ శాఖ ఆమోదం తెలిపింది. ఆలయ అభివృద్ధి కోసం నిధులను వినియోగించనున్నారు. మంత్రి మల్లారెడ్డి చొరవతోనే నిధులు మంజూరైనట్లు పోచారం పాలకవర్గం ఈ సందర్భంగా పేర్కొంది.

చలివేంద్రం షురూ..

శామీర్‌పేట్: పాదచారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని బీఆర్‌ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ ఎల్లుబాయి, బీఆర్‌ఎస్ శామీర్‌పేట మండల అధ్యక్షుడు సుదర్శన్, ఉపసర్పంచ్ రమేష్‌యాదవ్, పలువురు వార్డుసభ్యుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

13వ వార్డులో కంటి వెలుగు ప్రారంభం



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని వైద్యులతో కలిసి ఆమె ప్రారంభించి అద్దాలు పంపిణీ చేశారు. వార్డు ప్రజలు కంటి వెలుగు శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వారు అద్దాలు, మందులు పొందాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ నివారణకు చర్యలు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో లోఓల్టేజీ నివారణకు చర్యలు చేపట్టడం జరుగుతుందని కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వార్డు పరిధిలోని తిరుమల రాఘవేంద్ర నగర్ కాలనీలో లోఓల్టేజీ నివారణకు కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏడీఈ కిషన్‌నాయక్, ఏఈ కామేశ్వర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీనివాస్, కేశవులు, విద్యాధర్, రమేష్, రవిగురురాజ్, బాలాజీ, హనుమంతరావు, సురేష్, గాంధీవేల్పుల, వీరన్నగౌడ్, బత్తిని, బద్రినారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు



ప్రభుత్వ భూమిలో సూచిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్–810లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాన్ని శుక్రవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో కూల్చివేయించి ప్రభుత్వ సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టరాదన్నారు. ప్రభుత్వ భూముల్లో కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్లకు నివాళి



ఘట్‌కేసర్‌లో నివాళులర్పిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అమరులైన ఐదుగురు జవాన్లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఉప సర్పంచులు నరేశ్, రవి, వార్డు సభ్యుడు ఆంజనేయులు ముదిరాజ్, నాయకులు మహిపాల్‌రెడ్డి, సత్తయ్యముదిరాజ్, పవీణ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

'కేసీఆర్ కిట్'కు నిధులేవీ..?

- ఎదురు చూస్తున్న గర్భిణులు, బాలింతలు
- నిలిచిపోయిన నగదు ప్రోత్సాహం
- ఏడాదిగా నిధులు లేక పథకానికి గ్రహణం
- జిల్లాకు బకాయిలు రూ.15.30 కోట్లకు పైమాటే..





ఇద్దరు ఆడపిల్లలు పుట్టినా ఇవ్వలేదు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకం ప్రసవ వేదన పడుతోంది. ఈ పథకం ప్రారంభంలో ఎంతగానో మేలు చేసినా.. నిధుల లేమితో గతేడాది నుంచి గర్భిణులు, బాలింతలకు ప్రోత్సాహం ఇవ్వలేకపోతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించడానికి మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత అంశాల్లో భాగంగా రూ.12 వేలు ఇచ్చి భరోసా కల్పించింది. మొదట్లో బాగానే అమలైనా సంవత్సరం నుంచి మొదటి కాన్పుకు డబ్బులు అందడం లేదని గర్భిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బుల చెల్లింపులు ఇలా..

తల్లి గర్భంలో బిడ్డ పడగానే ప్రభుత్వ ఆస్పత్రిలో పేరు నమోదు చేయించుకోవాలి. రెండుసార్లు పరీక్షలు చేయించుకున్న తర్వాత మంచి ఆహారం తీసుకునేందుకు మొదటి విడత రూ.3 వేలు అందజేస్తారు. ప్రసవంలో మగబిడ్డ పుడితే రూ.4 వేలు, ఆడపిల్ల పుడితే రూ.5 వేలతో పాటు కేసీఆర్ కిట్‌ను అందజేస్తారు. పుట్టిన చిన్నారికి మూడు నెలల తర్వాత టీకాలు వేయించగానే రూ.3 వేలు ఆ తర్వాత చివరి విడత రూ.2 వేలు ఇవ్వాలని పథకంలో నిర్ణయించారు. బాబు పుడితే రూ.12 వేలు, పాప జన్మనిస్తే రూ.13 వేలను నాలుగు విడతల్లో తల్లి బ్యాంకు ఖాతాలో వేయాల్సి ఉంటుంది.

రావాల్సినవి రూ.15.30 కోట్లకు పైమాటే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో సుమారు 3,622 మంది గర్భిణులు, బాలింతలకు ఈ పథకం ద్వారా వివిధ దశల్లో రావాల్సిన డబ్బులు రాకపోవడంతో బకాయిలు ఉన్నాయి. పేద కుటుంబాలు ఈ డబ్బుతో లబ్ధి పొందాలని ఆశ పడుతున్నారు. జిల్లా మొత్తం మీద రూ.7 కోట్లు బకాయిలు ఉన్నాయి. కొందరికి ఇద్దరు పిల్లలు పుట్టినా అందని పరిస్థితి నెలకొంది.

పీర్జాదిగూడకు చెందిన రాజమ్మ చికిత్స కోసం ప్రభుత్వ మాతాశిశు కేంద్రానికి వచ్చింది. ఐదు నెలలు దాటినా మొదటి విడత డబ్బులు రాలేదని అంటోంది. నగదు ప్రోత్సాహం వస్తుందనే ఇక్కడికి వచ్చానని చెబుతోంది. ఇదే పరిస్థితిని ఒక రాజమ్మ సంబంధించిన ఆవేదన మాత్రమే కాదు. జిల్లాలో వందలాది మంది మహిళలు ఎదుర్కొంటున్నారు.

> **దశలవారీగా విడుదల**
>
> కేసీఆర్ కిట్ పథకానికి సంబంధించి దశలవారీగా నిధులు విడుదల అవుతున్నాయి. వాటికి అనుగుణంగా చెల్లింపులు జరుగుతున్నాయి. బకాయిల విషయాన్ని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తున్నాం.
>
> – డాక్టరు పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ, మేడ్చల్ జిల్లా.

ప్రతి విద్యార్థి ప్లేస్‌మెంట్‌తో బయటకు అడుగుపెట్టాలి



సక్సెస్ మీట్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: సీఎంఆర్ గ్రూప్స్ కళాశాలలో చదువుకునే విద్యార్థులు తమ చదువు పూర్తయ్యే నాటికి ప్లేస్‌మెంట్‌తో బయటకు అడుగు పెట్టాలని, అందుకు తమ యాజమాన్యం నిత్యం కృషి చేస్తోందని సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ కళాశాలలో శుక్రవారం ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ నిర్వహించారు. మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఇప్పటివరకు సీఎంఆర్‌టీసీ కళాశాలలో చదివిన 600 మందికిపైగా విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ప్రతి విద్యార్థి బాగా చదివి మంచి ఉద్యోగం పొందేందుకు ఎంత ఖర్చయినా సరే అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ రాజిరెడ్డి, డీన్ దర్మోజిరావు, సృజన్ అలీబేగ్, అశుతోష్ సక్సేన, దుర్గాప్రసాద్‌రెడ్డి, మాధవరావు, హిమబిందు అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 16వ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ శుక్రవారం రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డులో ముస్లింల ఇంటికి వెళ్లి రంజాన్ కానుకలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో విజయ్‌ముదిరాజ్, యశ్వంత్‌యాదవ్, సాయికిరణ్, వార్డు అధ్యక్షుడు సలీం, శశిబేగం, కేస్కార్, హబీబ్, జహంగీర్, ఫయూమ్ స్థానికులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబీకులకు ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: కొర్రెముల్ గ్రామానికి చెందిన కుర్రి కలమ్మ అనారోగ్యంతో శుక్రవారం మరణించింది. సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ మృతురాలి నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం అంత్యక్రియలకు సొంత డబ్బులు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజుముదిరాజ్, వార్డు సభ్యులు ఆంజనేయులు, నాయకులు రవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లను కేటాయించాలి



మాట్లాడుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

కీసర: కాంగ్రెస్ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తే బీఆర్‌ఎస్ పాలనలో అనర్హులకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తొటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీలో పంపిణీ చేయకుండా ఉన్న ఇళ్లను నిరుపేదలకు అందజేయాలని ఆయన అన్నారు. మున్సిపల్ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఈగ శ్వేతరాజు ఆధ్వర్యంలో రెండో రోజు కొనసాగిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. సమస్యకు పరిష్కారం లభించేవరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నామన్నారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోగుల సరితావెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీకొడుకు అదృశ్యం



లతా రుయిదాస్(ఫైల్)

జవహర్‌నగర్: తల్లి కొడుకు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహేష్ రుయిడాస్, భార్య లతా రుయిడాస్(30), ఒక కుమారుడితో కలిసి హకీంపేటలోని నీసాలో నివాసముంటున్నారు. శుక్రవారం లతా రుయిడాస్ తన కుమారుడితో కలిసి ఆస్పత్రికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో వారి ఆచూకీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా లభించకపోవడంతో భర్త మహేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్ల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



దేవరయాంజాల్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

శామీర్‌పేట్: 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో పెట్టిన రెడ్డి కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రెడ్డి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 23న కీసరలోని కేబీఆర్ గార్డెన్‌లో నిర్వహించే మేడ్చల్ రెడ్ల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను శుక్రవారం తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లో రెడ్డి సంఘం సభ్యులు ఆవిష్కరించారు. సభకు రెడ్లు అధిక సంఖ్యలో పాల్గొని రెడ్డి కార్పొరేషన్ సాధించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి ఐకేసీ నాయకులు హరినాథ్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పలువురు సభ్యులు పాల్గొన్నారు.

యాచకుడి మృతి

ఘట్‌కేసర్: గుర్తు తెలియని యాచకుడి మృతదేహం ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో లభ్యమైంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ అన్నోజీగూడ పెట్రోల్ బంక్ సమీపంలో ఓ చెట్టు కింద వ్యక్తి(50) పడి ఉన్నాడని ఫోన్ రావడంతో 100 డయల్‌కు కాల్ వచ్చింది. స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా స్పృహలో లేడని గ్రహించి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వైద్యసిబ్బంది అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. సమీప ప్రాంతంలో విచారించగా అతడు భిక్షాటన చేస్తూ సమీప చెట్టు కింద నివసించేవాడని తేలింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నామన్నారు.

దుర్వాసనపై కాలనీవాసుల ఫిర్యాదు

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో జవాసాలకు సమీపంలో ఆరబోసిన వేప గింజల కల్లం కారణంగా దుర్వాసన వెదజల్లుతోందని గోల్డెన్ వ్యాలీ కాలనీవాసులు పంచాయతీలో ఫిర్యాదు చేయగా యజమానికి నోటీసు అందజేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పాలక వర్గం సహాయ పర్యావరణవేత్త మహేశ్‌కు విన్నవించగా స్థలాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. 3 రోజుల్లో నివేదిక అందజేస్తానని తెలిపారు. మశ్చేందర్‌రెడ్డి స్థానికులు ఉన్నారు.

ప్రారంభమైన బొడాయి వార్షికోత్సవం

మల్లాపూర్: నాచారం గ్రామ బొడ్రాయి పంచమ వార్షికోత్సవం వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గ్రామ పెద్ద పంతులు వేదాంత నర్సింహమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బండాల సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్తులు శ్రీరామ్ సత్యనారాయణ, రాగిరి మోహన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రమణారెడ్డి పాండురంగం, క్రిష్టయ్య, నర్సింగ్‌రావు, యాదగిరి, నవీన్‌కుమార్, శివకుమార్, దాసరి కర్ణ, గోపీ, నాగరాజ్, జంగం అశోక్, వాసు ప్రభాకర్, రాజు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ కౌంటర్ ప్రారంభం

కీసర: ఆర్టీసీ అధికారులు వికలాంగులకు ఉచితంగా బస్‌పాస్‌లను అందజేసేందుకు ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపల్ కార్యాలయం వద్ద కుషాయిగూడ ఆర్టీసీ డిపో అధికారులు ఏర్పాటు చేసిన బస్‌పాస్ కౌంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి అవకాశాన్ని అర్హత కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఆంజనేయులుగౌడ్, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కీసర: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం రాంపల్లిదాయర గ్రామానికి చెందిన చొక్కాపురం మధు తన కుమారుడికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.1.25 లక్షల చెక్కును మంత్రి లబ్ధిదారురాలికి అందజేశారు. బీఆర్‌ఎస్ నేతలు కందాడి శ్రీకాంత్‌రెడ్డి, రామిడి రాజిరెడ్డి, ముక్క మహేందర్, కౌకుట్ల శ్రీకాంత్‌రెడ్డి, భానుతేజరెడ్డి, మామిడి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి



మహేందర్(ఫైల్)

మేడ్చల్‌రూరల్: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన ఇటబోయిన మహేందర్(43) ఈ నెల 19న మధ్యాహ్నం ఇంట్లో నుంచి తన ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య రజిత ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం వెతికారు. శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని రాజబొల్లారం గ్రామ పరిధిలోని వ్యవసాయబావిలో మృతదేహం తేలి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు, పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మృతుడు మహేందర్‌గా గుర్తించారు. ప్రమాదవశాత్తు కాలు జారీ బావిలో పడి ఈతరాక మృతిచెంది ఉండవచ్చని భార్య ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

ముస్లింలకు నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: రంజాన్ సందర్భంగా మండలంలోని గౌడవెల్లి గ్రామ ముస్లింలకు పీసీసీ అధికార ప్రతినిధి నియోజకవర్గ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరైన నిత్యావసర సరుకుల కిట్‌లను అందజేశారు. కిట్‌లో బియ్యం, పప్పు, చక్కెర, నూనె తదితర వస్తువులు ఉన్నాయి. హిందు ముస్లింలు ఐక్యతతో దేశాన్ని మతతత్వ శక్తుల నుంచి కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. బీఆర్‌ఎస్ ముస్లింలను ఓటు బ్యాంకుగా వాడుకుంటోందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవి ముదిరాజ్, వినోద్‌గౌడ్, మాజీ సర్పంచ్ భగవాన్‌దాస్, రఘుపతిరెడ్డి, గణేష్‌యాదవ్, రవితేజ, సందీప్, సుధాకర్, రాజు, ఫసియుద్దీన్, పార్టీ శామీర్‌పేట్ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్, మండల నాయకులు పాల్గొన్నారు.

అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం



అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా న్యాయమూర్తి బి.సురేష్

కీసర: కీసర రైతు వేదిక కార్యాలయం వద్ద శుక్రవారం అగ్రి లీగల్ ఆయిడ్ క్లినిక్‌ను గౌరవ జిల్లా న్యాయమూర్తి, లీగల్ సర్వీసేస్ చైర్మన్ బి.సురేష్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూసమస్యలపై న్యాయమైన సలహాలు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, జిల్లా వ్యవసాయాధికారి మేరిరేఖ, సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట్‌రాంరెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్ఎంపీపీ జె.సత్తిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఏఈఓ వందన, సత్యనారాయణ, కీసర సర్పంచ్ మాధురి, ఎంపీటీసీ సభ్యుడు టి.నారాయణ, రైతులు కందాడి వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చెప్యాల వెంకట్రామిరెడ్డి, పెంటయ్యగౌడ్, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌గా త్రిలేశ్వర్‌రావు



మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా టీఎస్‌వీఎన్ త్రిలేశ్వర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన అహ్మద్ షఫీ ఉల్లా రెండు నెలల క్రితం రాజకీయ ఒత్తిడిలతో దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. ఆ తర్వాత మెప్మాకు బదిలీపై వెళ్లారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ రాములు మేడ్చల్ ఇన్‌చార్జిగా కొనసాగారు. తాజాగా మున్సిపల్ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న త్రిలేశ్వర్ రావును ప్రభుత్వం మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించడంతో ఆయన శుక్రవారం మేడ్చల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

త్వరలో ఆరోగ్య మహిళా పథకం ప్రారంభం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పుట్ల శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్

శామీర్‌పేట్: మహిళలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం శామీర్‌పేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మేడ్చల్ జిల్లా వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో ఆరోగ్య మహిళా పథకం ప్రారంభం కానుందని, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, బస్తీ దవాఖానాల్లో ప్రతి మంగళవారం 57 ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఇక నుంచి మహిళల ఆరోగ్య సమస్యలన్నింటికీ వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. కమిషన్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సూచనలు పాటించాలని సూచించారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

మంత్రి చామకూర మల్లారెడ్డి



పార్కును ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని 2వ డివిజన్‌లో ఉన్న ఎస్సీ వైకుంఠధామంలో రూ.32 లక్షలతో చేపట్టిన పనులను, అలాగే శివసాయినగర్‌లోని పబ్లిక్ పార్కు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పీర్జాదిగూడలో అన్ని మతాలకు ఒకే దగ్గర వైకుంఠధామాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. స్నానాల గదులు, ప్రత్యేక నల్లాలు, దహన సంస్కారాలకు ప్రత్యేక నిర్మాణాలు, పచ్చని పూల మొక్కలతో సుందరీకరించినట్లు వెల్లడించారు. అలాగే వేసవి కాలంలో కాలనీల ప్రజలు సేద తీరేందుకు పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా పిల్లలు పెద్దలు పార్కుల్లోకి వచ్చి ఆహ్లాదకరమైన వాతావరణంలో గడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్లు కొడె పోచయ్య, సుభాష్‌నాయక్, బొడిగె స్వాతి కృష్ణగౌడ్, అనంత్‌రెడ్డి, హరిశంకర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, బచ్చరాజు తదితరులు పాల్గొన్నారు.

రోటర్‌డ్యామ్‌లో గ్రాడ్యుయేషన్ డే



ఘట్‌కేసర్: చౌదరిగూడ రోటర్‌డ్యామ్ అంతర్జాతీయ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డేని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసుకొని 6వ తరగతిలో చేరనున్న విద్యార్థులు తమ ఆటపాటలతో అలరించారు. సైన్స్ ప్రయోగాలు, జ్ఞాపకశక్తిని పెంచే గణిత యాక్టివిటీస్ విద్యార్థుల్లోని సృజనాత్మకతను తెలియజేశాయి. ప్రిన్సిపల్ రూపారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇంజినీర్లు, సైంటిస్టులు ఉన్నారని, విద్యార్థుల్లోని మేధాశక్తిని వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.